సాక్షి
రంగారెడ్డి
శనివారం । 18 । నవంబర్ । 2023



'తటస్థ' వ్యూహం

అభ్యర్థులు ప్రచారం ముమ్మరం చేశారు. ఎత్తుకు పై ఎత్తులు వేస్తూ వ్యూహాత్మకంగా ముందుకు కదులుతున్నారు. 10లో▸



ఓటే వజ్రాయుధం

'కదలండి.. ఓటు వేసి మీ బాధ్యతను నెర వేర్చండి' అంటూ ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తున్నారు. 10లో▸



'సంఘం' శరణం గచ్ఛామి!

అభ్యర్థులు ఆయా సంఘాలతో ఆత్మీయ సమ్మేళనాలు ఏర్పాటు చేస్తూ వారి మద్దతు కోరుతున్నారు. 10లో▸

న్యూస్‌రీల్

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకుడు చంద్రకాంత్ డాంగే

కొత్తూరు: మండలంలోని ఇన్ముల్‌నర్వ, పెంజర్ల, మల్లాపూర్, తీగాపూర్, కొత్తూరుతో పాటు పలు గ్రామాల్లో గుర్తించిన పోలింగ్ కేంద్రాలను శుక్రవారం ఎన్నికల పరిశీలకుడు చంద్రకాంత్ డాంగే క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కేంద్రాల్లో టాయిలెట్స్, దివ్యాంగులు, వృద్ధులకు ఇబ్బందులు లేకుండా కేంద్రాల్లోకి వచ్చేందుకు ర్యాంప్‌లు, విద్యుత్ సరఫరా తదితర ఏర్పాట్లను గమనించారు. పోలింగ్ కేంద్రాల్లో తీసుకోవాల్సిన చర్యలపై ఆయన అధికారులకు పలు సలహాలు, సూచనలు చేశారు. ఆయన వెంట సీఐ శంకర్‌రెడ్డి, ఎంపీడీఓ శరత్ చంద్రబాబు తదితరులు ఉన్నారు.

ఎన్నికల నియమాలు పాటించాల్సిందే

- ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి



మద్యం దుకాణంలో తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

చేవెళ్ల: ఎన్నికల నేపథ్యంలో మద్యం షాపుల నిర్వాహకులు నియమ నిబంధనలు పాటించాలని శంషాబాద్ ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఎ.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆయన ఆధ్వర్యంలో శుక్రవారం చేవెళ్ల ఎక్సైజ్ సర్కిల్ సీఐ శ్రీలత, సిబ్బంది మొయినాబాద్ మండల పరిధిలోని పలు మద్యం దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల నేపథ్యంలో బల్క్‌గా అమ్మకాలు చేయొద్దని, అలా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. దీనిపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని తెలిపారు. అన్ని జాగ్రత్తలు వహించాలని, లేదంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం వారు ఎన్నికల అబ్జర్వర్లను కలిశారు. వారి వెంట ఎక్సైజ్ ఎస్‌ఐలు, సిబ్బంది ఉన్నారు.

కబ్జాదారులకు కొమ్ముకాస్తున్న ప్రభుత్వం

మాజీ మంత్రి ఈటల రాజేందర్

కుత్బుల్లాపూర్: మాజీ మంత్రి ఈటల రాజేందర్ శుక్రవారం కుత్బుల్లాపూర్ బీజేపీ అభ్యర్థి కూన శ్రీశైలంగౌడ్‌తో కలిసి నియోజకవర్గంలో స్ట్రీట్ మీటింగ్‌లు నిర్వహించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో కబ్జాదారులకు కొమ్ముకాస్తూ వందలాది ఎకరాల ప్రభుత్వ స్థలాలను వారికి ధారాదత్తం చేస్తున్నారని విమర్శించారు. ఎల్లమ్మబండలో 250 ఎకరాల స్థలంలో 160 ఎకరాలను పేదలకు గత ప్రభుత్వాలు పంచిపెట్టాయని గుర్తు చేశారు. మిగిలిన 92 ఎకరాలు దేశ్‌పాండే అనే వ్యక్తి కబ్జా చేసే ప్రయత్నం చేస్తే ఆనాడు ప్రతిపక్షంలో ఉన్న తాము అడ్డుకున్నామని తెలిపారు. నేడు అదే వ్యక్తికి కేసీఆర్ రూ.4,500 కోట్ల పైచిలుకు విలువ చేసే భూమిని కట్టబెట్టారని ధ్వజమెత్తారు. బంజారాహిల్స్‌లో తాను రాములు నాయక్ కలిసి ప్రభుత్వ భూములను కబ్జా కాకుండా కాపాడుకున్నామని గుర్తు చేశారు. నాటి సీఎం రోశయ్యకు చెప్తే ఇళ్లను కూలగొట్టకుండా ఆపారన్నారు. కానీ ఈ ముఖ్యమంత్రి అన్నింటినీ కబ్జా పెడుతున్నారని.. కేసీఆర్ ప్రజలను కాకుండా డబ్బును నమ్ముకున్నారని విమర్శించారు.

తెలంగాణకు విముక్తి కల్పించాలి

- ఓయూ విద్యార్థులు

కొడంగల్: కేసీఆర్ పాలన నుంచి తెలంగాణకు విముక్తి కల్పించాలని ఓయూ విద్యార్థులు ప్రజలను కోరారు. వారు చేపట్టిన నిరుద్యోగ చైతన్య యాత్ర శుక్రవారం కొడంగల్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..హైదరాబాద్ నుంచి బస్సు యాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణలో విద్యార్థులకు అన్యాయం జరుగుతోందని తెలిపారు. నోటిఫికేషన్లు వేయడం లేదని, విద్యార్థులకు ఉపకార వేతనాలు చెల్లించడం లేదని ఆరోపించారు. ఎంతో కష్టపడి చదువుకొని నిరుద్యోగులుగా మిగిలి పోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పోటీ పరీక్షల పేపర్లను లీకేజీ చేసి అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. ఉన్నత చదువులు చదివిన వారికి బతుకుదెరువు లేకుండా పోయిందన్నారు. ఎస్‌ఐ భరత్ కుమార్‌రెడ్డి బస్సు యాత్ర వాహనం దగ్గరకు వచ్చి అనుమతి పత్రాలను పరిశీలించారు. బస్సు యాత్రకు మాత్రమే అనుమతి ఉందని, ఊరేగింపునకు అనుమతి లేదన్నారు. దీంతో విద్యార్థులు బస్సులో కూర్చొని పట్టణంలో ప్రచారం చేశారు.

షి'కారు' చేసేనా?

మహేశ్వరం, ఎల్బీనగర్‌లో వింత పరిస్థితి

- కాంగ్రెస్‌లో గెలిచి.. బీఆర్‌ఎస్‌లో నిలిచి
- గత ఎన్నికల్లో పార్టీ మారిన అభ్యర్థులు
- ఇప్పటికీ బోణీ కొట్టని గులాబీ పార్టీ
- ఈసారైనా కలిసి వచ్చేనా..?



సాక్షి, రంగారెడ్డిజిల్లా: రాష్ట్రంలో రెండుసార్లు అధికారం చేజిక్కించుకున్న బీఆర్‌ఎస్ ఇప్పటి వరకు జిల్లాలోని రెండు స్థానాల్లో మాత్రం ఖాతా తెరవలేకపోయింది. జిల్లాలో ఎనిమిది నియోజకవర్గాల్లోని ఆరు స్థానాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులు విజయం సాధించారు. మహేశ్వరం, ఎల్బీనగర్‌లో మాత్రం ఇప్పటికీ ఆ పార్టీ అభ్యర్థులు గెలువలేకపోయారు. ఈసారైనా ఇక్కడ బోణీ కొట్టి చరిత్రను తిరగరాయాలని ఆ పార్టీ భావిస్తోంది. ఇదే సమయంలో కాంగ్రెస్ కూడా ఈ రెండు స్థానాలను కీలకంగా తీసుకుంది. ఎట్టి పరిస్థితుల్లో ఇక్కడ తమ పట్టు కోల్పోకుండా చూడాలని గట్టి ప్రయత్నం చేస్తోంది. ఈ మేరకు బలమైన అభ్యర్థులను రంగంలోకి దించింది. ఈ రెండు స్థానాలు ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

మహేశ్వరంలో పాగా వేసేనా..?

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా 2009లో మహేశ్వరం నియోజకవర్గం ఏర్పాటైంది. తొలి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున పటోళ్ల సబితారెడ్డి పోటీ చేసి ఘన విజయం సాధించారు. ఆ తర్వాత అప్పట్లో చోటు చేసుకున్న పలు రాజకీయ సమీకరణాలతో ఆమె పోటీకి దూరంగా ఉన్నారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు తర్వాత 2014లో నిర్వహించిన తొలి ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి తీగల కృష్ణారెడ్డి ఇదే స్థానం నుంచి పోటీ చేసి విజయం సాధించారు. అనంతరం బీఆర్‌ఎస్‌లో చేరారు. 2018లో బీఆర్‌ఎస్ తరఫున పోటీలో నిలిచిన టీకేఆర్ ఓటమిపాలుకాగా కాంగ్రెస్ అభ్యర్థి పటోళ్ల సబితారెడ్డి విజయం సాధించారు. ఆ తర్వా త ఆమె కాంగ్రెస్‌ను వీడి అధికార పార్టీలో చేరి మంత్రిగా కొనసాగుతున్నారు. ప్రస్తుతం ఆమె బీఆర్‌ఎస్ నుంచి బరిలో నిలిచారు. ఇప్పటి వరకు ఇక్కడ బీఆర్‌ఎస్ గెలుపొందలేదు.

నియోజకవర్గం	మహేశ్వరం
మొత్తం ఓటర్లు	5,46,713
పురుషులు	2,81,203
మహిళలు	2,65,307
థర్డ్ జెండర్లు	67
ఎన్‌ఆర్‌ఐలు	59
సర్వీసు ఓటర్లు	77
పోలింగ్ బూతులు	511
పోటీలో ఉన్న మొత్తం అభ్యర్థులు	27
బీఆర్‌ఎస్	పటోళ్ల సబితారెడ్డి
కాంగ్రెస్	కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి
బీజేపీ	అందెల శ్రీరాములు

ఎల్బీనగర్‌లో జెండా ఎగిరేనా?

మలక్‌పేట్ నియోజకవర్గంలో అంతర్భాగంగా ఉన్న ఎల్బీనగర్ 2009లో కొత్త నియోజకవర్గంగా ఆవిర్భవించింది. తొలి ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి బరిలోకి దిగిన దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, టీడీపీ నుంచి ఎస్‌వీ కృష్ణప్రసాద్ పోటీ చేశారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి విజయం సాధించారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు తర్వాత జరిగిన తొలి ఎన్నిక (2014 ఎన్నిక)ల్లో కాంగ్రెస్ నుంచి సుధీర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నుంచి ముద్దగోని రామ్మోహన్‌గౌడ్, టీడీపీ నుంచి ఆర్.కృష్ణయ్య పోటీ చేయగా కృష్ణయ్య విజయం సాధించారు. 2018 ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నుంచి ముద్దగోని రామ్మోహన్‌గౌడ్ పోటీ చేసి ఓటమి పాలయ్యారు. కాంగ్రెస్ అభ్యర్థి ప్రస్తుత బీఆర్‌ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి విజయం సాధించారు. ఆ తర్వాత ఆయన కాంగ్రెస్‌ను వీడి అధికార బీఆర్‌ఎస్‌లో చేరారు. ప్రస్తుతం ఆయన బీఆర్‌ఎస్ బీఫాంపై తన అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు.

నియోజకవర్గం	ఎల్బీనగర్
మొత్తం ఓటర్లు	5,93,774
పురుషులు	3,09,557
మహిళలు	2,84,024
థర్డ్ జెండర్లు	131
ఎన్‌ఆర్‌ఐలు	12
సర్వీసు ఓటర్లు	50
పోలింగ్ బూతులు	570
పోటీలో ఉన్న మొత్తం అభ్యర్థులు	48
బీఆర్‌ఎస్ అభ్యర్థి	దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి
బీజేపీ	సామ రంగారెడ్డి
కాంగ్రెస్	మధుయాష్కీగౌడ్

ఇక్కడ సెటిలర్లు.. అక్కడ మైనార్టీలు

ఎల్బీనగర్ నియోజకవర్గంలో రెడ్డి సామాజిక వర్గం ఓటర్లు 40 వేలు, గౌడ్స్ 50 వేలు, ఎస్సీలు 60 వేలు, ఎస్టీలు 15 వేలు, యాదవ, కురుమలు 25 వేలు, క్రిష్టియన్లు 15 వేలు, వైశ్యులు, బ్రాహ్మణులు 15 వేలు, కమ్మలు పది వేల మంది ఉన్నారు. శివారు జిల్లాలకు చెందిన వారితో పాటు ఏపీకి చెందిన వారు ఇక్కడే స్థిరపడ్డారు. ప్రధాన పార్టీల అభ్యర్థుల గెలుపోటములను ఈ సెటిలర్లు ప్రభావితం చేసే అవకాశం ఉంది. వీరిని ప్రసన్నం చేసుకునేందుకు ఆయా పార్టీల అభ్యర్థులు పోటీపడుతున్నారు. ఇక మహేశ్వరంలో సుమారు 60 వేలకుపైగా ఓటర్లు ముస్లిం మైనార్టీలు ఉన్నట్లు అంచనా. రెడ్డి ఓటర్లు 15 వేలు, ఎస్సీ, ఎస్టీలు సుమారు లక్ష మంది ఉన్నట్లు అంచనా. క్రిష్టియన్లు 20 వేల వరకు ఉన్నారు. గొల్లకురుమలు 50 వేల కుపైగా, గౌడ్స్ 30 మంది వరకు ఉన్నట్లు అంచనా. అధికార బీఆర్‌ఎస్, ప్రతిపక్ష కాంగ్రెస్ ఈ మైనార్టీ ఓటర్లపైనే ఆశలు పెట్టుకున్నాయి. హిందూ ఓటర్లు, స్థానిక ఓటర్లపై బీజేపీ అభ్యర్థి ఆశలు పెట్టుకున్నారు. వారిని ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ భారతి హోళికేరి

పొరపాట్లకు ఆస్కారం ఇవ్వొద్దు

- ఎన్నికల విధులపై అవగాహన అవసరం
- కలెక్టర్ భారతి హోళికేరి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటిస్తూ.. ఎలాంటి పొరపాట్లు జరగకుండా విధులను నిర్వర్తించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భారతి హోళికేరి అన్నారు. కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శుక్రవారం అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌తో కలిసి ఎన్నికల నిర్వహణకు సంబంధించిన పలు అంశాలపై రిటర్నింగ్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల నిర్వహణలో భాగంగా నిర్వర్తించాల్సిన కార్యకలాపాలపై రిటర్నింగ్ అధికారులకు పూర్తి అవగాహన ఉండాలని అన్నారు. బ్యాలెట్ పత్రాల ముద్రణలో ఎలాంటి తప్పిదాలకు ఆస్కారం ఇవ్వొద్దన్నారు. రిటర్నింగ్ అధికారి పరిధిలోని అన్ని టీములకు వారికి కేటాయించిన విధులపై పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. ఎన్నికల (ఈవీఎంలు, వీవీ ప్యాట్లు) పంపిణీ కేంద్రాల నుంచి, పోలింగ్ ముగిసిన తరువాత రిసెప్షన్ సెంటర్లకు జాగ్రత్తగా తీసుకెళ్లేలా విధులు నిర్వహించే సిబ్బందికి అవగాహన కల్పించాలన్నారు. సిబ్బందికి వాహనాలు ఏర్పాటు చేయాలని, పోలింగ్ కేంద్రాల్లో వారికి అవసరమైన సదుపాయాలు కల్పించాలని, తాగునీరు, విద్యుత్ సరఫరా, ఫర్నిచర్, టాయిలెట్స్ వసతులను పరిశీలించాలని పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాంపులు ఏర్పాటు చేయాలని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పీడబ్ల్యూడీ, సీనియర్ సిటిజన్స్‌కు ఫామ్–12డి ఇవ్వాలన్నారు. ప్రతి ఓటర్‌కు ఓటర్ సమాచార స్లిప్పులను వంద శాతం పంపిణీ చేయాలని సూచించారు. పోలింగ్ ప్రక్రియకు అవసరమైన ఆయా పనులను ముందస్తు ప్రణాళికతో పూర్తి చేయాలన్నారు. సమావేశంలో రిటర్నింగ్ అధికారులు, పోలీస్ అధికారులు, రవాణా శాఖ అధికారులు, ఎన్నికల విభాగం అధికారి సైదులు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించి తీరాలి

- ఎన్నికల అధికారులు



పార్టీల నేతలతో సమావేశమైన అధికారులు

చేవెళ్ల: ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు ఎన్నికల నియమ నిబంధనలు తప్పనిసరి పాటించాలని.. ఎన్నికల్లో చేసే ఖర్చుల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని ఎన్నికల జనరల్ అబ్జర్వర్ శిల్పా గుప్తా, వ్యయ పరిశీలకుడు జనార్దన్, పోలీస్ అబ్జర్వర్ అజిత్‌సింగ్ యాదవ్ అన్నారు. మండలకేంద్రంలోని ఎన్నికల రిటర్నింగ్ కార్యాలయంలో శుక్రవారం ఆయా పార్టీల నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పాటించాల్సిన ఎన్నికల నియమ నిబంధనల గురించి వివరించారు. ఎన్నికల ఖర్చుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. లెక్కలు పక్కగా చూపించాలన్నారు. అభ్యర్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం చేవెళ్లలోని ఎన్నికల స్ట్రాంగ్‌రూమ్‌ను, పోలింగ్ స్టేషన్లను పరిశీలించారు. ఎన్నికల నిర్వహణ విషయంలో ఎలాంటి అశ్రద్ధ వహించవద్దని అన్నారు. ఎన్నికల అధికారులు విధులు సక్రమంగా నిర్వర్తించాలని సూచించారు. కార్యక్రమంలో చేవెళ్ల రిటర్నింగ్ అధికారి సాయిరాం, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి కృష్ణయ్య పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న సబితారెడ్డి

అభివృద్ధికి పట్టం కట్టండి

మీర్‌పేట: పనిచేసే వారిని గుర్తించి అభివృద్ధికి పట్టం కట్టాలని బీఆర్‌ఎస్ మహేశ్వరం అభ్యర్థి సబితారెడ్డి అన్నారు. కార్పొరేషన్ పరిధిలోని 1, 2, 3, 4, 18, 19, 20, 21, 41 డివిజన్లకు చెందిన కాలనీవాసులతో శుక్రవారం సాయంత్రం గాయత్రీనగర్‌లో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడారు. ఈ ప్రాంతం గురించి తెలియనివారు, ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు కనిపించని వారు ఎన్నికలు రాగానే వస్తున్నారని, ప్రజలు ఆలోచించి ఓటు వేయాలన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సీఎం కేసీఆర్ రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని గుర్తుచేశారు. ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తున్న ప్రభుత్వం విమర్శలు చేయడం సరైంది కాదని, ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో ప్రజలంతా కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మేయర్ ఎం.దుర్గ, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, నాయకులు కామేష్‌రెడ్డి, మేకల రవిందర్‌రెడ్డి, యాదగిరి ముదిరాజ్, వంటేరు నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుర్తుల గుబులు

- కారు పార్టీకి రోడ్డు రోలర్, రోటీమేకర్ గండం
- ఒకే రకంగా కనిపిస్తున్న సింబల్స్
- ప్రధాన పార్టీల అభ్యర్థులకు తప్పని పరేషాన్

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఎన్నికల కమిషన్ కేటాయించిన పలు గుర్తులు అధికార బీఆర్‌ఎస్ అభ్యర్థులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. ఈవీఎంపై కారు గుర్తును పోలిన రోడ్డు రోలర్, రోటీ మేకర్ ఉండటమే ఇందుకు కారణం. ఓటర్లను గందరగోళానికి గురి చేసేందుకు ప్రధాన పార్టీ అభ్యర్థి పేరును పోలిన పేరుతోనే స్వతంత్రులను బరిలోకి దించారు. ఒకే పేర్లు పెద్ద సమస్య కాకపోయినప్పటికీ.. కారును పోలిన గుర్తులు గుబులు పుట్టిస్తున్నాయి.

ఇబ్రహీంపట్నంలో..

నియోజకవర్గంలో మొత్తం 28 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. వీరిలో 16 మంది గుర్తింపు పొందిన పార్టీల నుంచి బరిలో ఉండగా, మిగిలిన వారు స్వతంత్రులు ఉన్నారు. కారు పార్టీ అభ్యర్థి మంచిరెడ్డి కిషన్‌రెడ్డికి కేటాయించిన సీరియల్ నంబర్ ఐదు కిందే ఏడో నంబర్‌లో అదే పేరుతో కూడిన (కె.కిషన్‌రెడ్డి) అలయన్స్ ఆఫ్ డెమొక్రటిక్ రీ ఫార్మర్స్ పార్టీ అభ్యర్థికి రోటీ మేకర్‌ను కేటాయించారు. చూసేందుకు కారు, రోటీ మేకర్ ఒకేలా కన్పిస్తుండటంతో కంటిచూపు సరిగా కనిపించని వృద్ధులు రోటీ మేకర్‌నే కారుగా భావించే అవకాశం లేకపోలేదు.

ఎల్బీనగర్‌లో..

నియోజకవర్గంలో అత్యధికంగా 48 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. 26 మంది గుర్తింపు పొందిన వివిధ పార్టీల నుంచి పోటీ చేస్తుంటే.. మిగిలిన వారు స్వతంత్రులు. సీరియల్ నంబర్ రెండును బీఆర్‌ఎస్ అభ్యర్థి దేవిరెడ్డి సుధీర్‌రెడ్డికి కేటాయించారు. అదే ఇంటి పేరుతో (దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి స్వతంత్ర అభ్యర్థి) మరో వ్యక్తి కూడా పోటీలో ఉన్నారు. ఆయనకు 33 సీరియల్ నంబర్, బకెట్ గుర్తును కేటాయించారు. ఈవీఎంపై ఇద్దరి పేర్లు ఒకే ఇంటిపేరుతో ఒకేలా ఉండటం ప్రధాన పార్టీ అభ్యర్థికి ఆందోళన కలిగిస్తోంది. సీరియల్ నంబర్ నాలుగును బీజేపీ అభ్యర్థి సామరంగారెడ్డికి కేటాయించారు. జనశంఖారావం పార్టీ అభ్యర్థికి బెండకాయల గుర్తును కేటాయించారు. చూడ్డానికి కమలం పువ్వు, బెండకాయలు ఒకే రకంగా కన్పిస్తుండటంతో ఓటర్లు అయోమయానికి గురయ్యే అవకాశం ఉందని భావిస్తున్నారు.

అప్పు ఇవ్వలేదనే..

- మహిళ దారుణ హత్య
- సీసీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు
- హత్య కేసును ఛేదించిన ఫార్మాసిటీ పోలీసులు

యాచారం: అప్పు ఇవ్వని పాపానికి ఓ మహిళను గొంతు నులిమి దారుణంగా హత్య చేశాడు. ముచ్చర్ల గ్రామ శివారులో పెట్రోల్ పోసి అంతం చేసిన కేసును పోలీసులు ఛేదించారు. సీసీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు ప్రారంభించి శుక్రవారం అతన్ని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ సీఐ రామాంజనేయులు తెలిపిన వివరాలు.. మంచాల మండలంలోని జాపాల గ్రామానికి చెందిన బత్తోజు సందీప్‌కుమార్ ఓ ప్రైవేట్ స్కూల్ బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. తన ఇంటి సమీపంలోనే ఉండే మంథని యాదమ్మను కొద్ది రోజులుగా రూ.లక్ష అప్పు ఇవ్వాలని అడుగుతున్నాడు. ఆ క్రమంలోనే ఈ నెల 14న కారును అద్దెకు తీసుకుని అదే రోజు సాయంత్రం తుర్కయంజాల్‌లో విద్యుత్ శాఖ డీఈఈ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తున్న యాదమ్మను ఇంటికి తీసుకెళ్తానని ఎక్కించుకున్నాడు. సందీప్‌కుమార్ మాయమాటలతో ఆమెను నమ్మించి కందుకూరుకు వెళ్లే మార్గంలో కారును నిలిపి రూ.లక్ష అప్పు కావాలని అడిగాడు. ప్రస్తుతం తన వద్ద లేవని వారించింది. చీకటి పడింది ముందైతే ఇంటికి వెళ్లాలంటూ అతడిని గట్టిగా నిలదీసింది. దీంతో కోపానికి గురైన సందీప్ ఓ చేత్తో ఆమె జుట్టును పట్టుకుని, మరో చేత్తో గొంతు నులిమి చంపేశాడు.

ఆనవాళ్లు కనిపించకుండా..

మృతదేహాన్ని కనిపించకుండా చేయాలనే ఉద్దేశంతో అతడు ముచ్చర్ల గ్రామ శివారులోని చాకలోని కుంట సమీపంలో పెట్రోల్ పోసి కాల్చేశాడు. ఆమె మెడలోని బంగారు నగలు తీసుకుని అనంతరం నేరుగా జాపాలకి వచ్చాడు. పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు చేశారు. కారు నంబర్ గుర్తించి వివరాలు ఆరా తీయగా యాదమ్మను చంపేసింది సందీప్‌కుమారేనని గుర్తించారు. అతన్ని శుక్రవారం కుర్మిద్దలో వాహనాల తనిఖీలో అదుపులోకి తీసుకొని తమదైన శైలిలో విచారించగా నేరం అంగీకరించాడు. అతడిని రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు. 24 గంటల్లోనే కేసును ఛేదించిన గ్రీన్ ఫార్మాసిటీ పోలీసులను మహేశ్వరం డీసీపీ శ్రీనివాస్ అభినందించారు.



లెక్కే లేని లిక్కర్!

- ఎన్నికల వేళ గ్రేటర్‌లో భారీగా మద్యం
- పెళ్లిళ్లు, వేడుకల పేరిట కొనుగోళ్లకు అనుమతులు
- ఓటర్లను ప్రలోభాలకు గురి చేస్తున్న నాయకులు
- చోద్యం చూస్తున్న ఆబ్కారీ అధికారులు

సాక్షి, సిటీబ్యూరో: బోడుప్పల్‌కు చెందిన ఓ అపార్ట్‌మెంట్‌కు శుక్రవారం ఉదయం ఒక ప్రధాన రాజకీయ పార్టీకి చెందిన నాయకుడి నుంచి పది మద్యం సీసాలు, చికెన్, స్నాక్స్ ప్యాకెట్‌లు వచ్చాయి. కానీ తమ అపార్ట్‌మెంట్‌లో ఉండేవారి సంఖ్యకు అవి ఏ మాత్రం చాలవని అపార్ట్‌మెంట్ ప్రతినిధి చెప్పడంతో మరో ఐదు బాటిళ్లను అదనంగా అందజేశారు. ఇలా ఒక బోడుప్పల్‌లోనే కాదు గ్రేటర్ అంతటా గత రెండు మూడు రోజులుగా మద్యం పంపిణీ జోరుగా సాగుతోంది. ఎన్నికలకు మరో 13 రోజులే ఉండడంతో మొదటి విడత పంపిణీకి శ్రీకారం చుట్టారు. ఇప్పటికే డివిజన్‌ల వారీగా పెద్ద ఎత్తున బాటిళ్లను నిల్వ చేసినట్లు సమాచారం. ఇందుకోసం పెళ్లిళ్లు, వేడుకల పేరిట, రకరకాలుగా ఎక్సైజ్‌శాఖ నుంచి మద్యం కొనుగోళ్లకు అనుమతులు తీసుకుంటున్నారు. ఒక్కో ఇంట్లో, అపార్ట్‌మెంట్‌లలో, కాలనీల్లో ఉండే ఓటర్ల సంఖ్యకు అనుగుణంగా బాటిళ్లను అందజేస్తున్నట్లు సమాచారం. దీంతో మద్యం అక్రమ అమ్మకాలపై ఎక్సైజ్ అధికారులు చేపట్టిన చర్యలు ఎలాంటి ఫలితాలను ఇవ్వడం లేదు. కొన్నిచోట్ల అధికారుల కళ్లు గప్పి పెద్ద ఎత్తున మద్యం కొనుగోలు చేస్తుండగా మరికొన్ని చోట్ల ఆబ్కారీశాఖ అధికారుల అండదండలతోనే రాజకీయ నాయకులకు ఎన్నికల మద్యం పంపిణీని కొనసాగించడం గమనార్హం.

నిండుగా నిల్వలు..

- మద్యం బాటిళ్లను పెద్ద ఎత్తున నిల్వ చేసేందుకు అపార్ట్‌మెంట్‌లలో ఖాళీగా ఉన్న ఫ్లాట్‌లను ఎంపిక చేసుకుంటున్నారు. నెల రోజుల కోసం వాటిని అద్దెకు తీసుకొని బాటిళ్లను అక్కడికి చేరవేస్తున్నట్లు వివిధ పార్టీలకు చెందిన శ్రేణులు చెబుతున్నాయి. కొన్నిచోట్ల కమ్యూనిటీ హాళ్లకు చేరవేసి అక్కడి నుంచి స్థానిక బస్తీల్లో అందజేస్తున్నట్లు సమాచారం.
- నగరంలోని అన్ని వైన్‌షాపులలో గతేడాది అక్టోబర్, నవంబర్ నెలల్లో విక్రయించిన మద్యం పైన 30 శాతం కంటే ఎక్కువగా విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు చెబుతున్నప్పటికీ ఆచరణలో అమలు కావడం లేదు. మరోవైపు మద్యం కొనుగోళ్లలో రాజకీయ పార్టీలు కూడా జాగ్రత్తలు పాటిస్తున్నాయి. ఒకే వైన్‌షాపు నుంచి ఎక్కువ మొత్తంలో కొనుగోలు చేయకుండా డివిజన్ల వారీగా ఎక్కడికక్కడ కొనుగోలు చేసి నిల్వ చేస్తున్నారు. ఇప్పటికే పుట్టిన రోజు వేడుకలు, సన్మానాలు, సమావేశాల పేరిట గ్రేటర్‌లో మద్యం వినియోగం భారీగా పెరిగినట్లు అంచనా.
- ఇదంతా ఒకవైపు అయితే, మరోవైపు నేరుగా ఓటరుకే చేరేవిధంగా అందజేయడం కోసం రాజకీయ నాయకులు నిల్వలపై ప్రధానంగా దృష్టి సారించినట్లు తెలిసింది. ఎన్నికల నిఘా పరిశీలకులకు కూడా ఎలాంటి అనుమానాలు రాకుండా అభ్యర్థులు ఈ బాధ్యతలన్నింటినీ స్థానిక నాయకులకే అప్పగిస్తున్నారు.

ఇతర రాష్ట్రాల నుంచి సరఫరా..

ఒకవైపు నగరంలోని మద్యం దుకాణాల నుంచి కొనుగోలు చేయడంతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లోని సరిహద్దు జిల్లాల నుంచి కూడా మద్యం వచ్చి చేరుతోంది. చెక్‌పోస్టుల వద్ద పనిచేసే కొద్ది మంది సిబ్బంది సహకారంతోనే మద్యం బాటిళ్లు రాష్ట్రాలు దాటి నగరానికి చేరుకుంటున్నాయి. గతంలో ఒడిశా నుంచి హైదరాబాద్ వరకు అక్రమ మద్యం ప్రవహించిన సంగతి తెలిసిందే. దీనిని అధికారులు కల్తీ మద్యంగా గుర్తించి అరికట్టారు. ఎన్నికల సందర్భంగా కల్తీ మద్యం కూడా పెద్ద ఎత్తున సరఫరా అయ్యే అవకాశం ఉందని కొందరు అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆబ్కారీశాఖ ఇటీవల కొన్ని కంటితుడుపు చర్యలు చేపట్టినప్పటికీ నిఘాను మరింత సమర్థంగా కొనసాగించలేకపోవడం వల్లే మద్యం యథేచ్ఛగా ప్రవహిస్తోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రచారంలో పార్టీ పదవులు


కందుకూరు: నియామకపత్రం అందుకుంటున్న శ్రీధర్

- బీఆర్ఎస్ నియోజకవర్గం సెక్రటరీగా శ్రీధర్
- బడంగ్‌పేట్ కార్పొరేషన్ ఉపాధ్యక్షుడిగా మురళీకృష్ణ

కందుకూరు: బీఆర్ఎస్ మహేశ్వరం నియోజకవర్గం సెక్రటరీగా మండల పరిధిలోని లేమూరుకు చెందిన ఢిల్లీ శ్రీధర్‌ముదిరాజ్ నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ....తనపై నమ్మకం ఉంచి పార్టీ పదవి అప్పగించినందుకు మంత్రికి ధన్యవాదాలు తెలిపారు. సబితమ్మ గెలుపుకు కష్టపడి పని చేస్తానన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు మన్నే జయేందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్, వైస్ చైర్మన్ చంద్రశేఖర్, నాయకులు జి.లక్ష్మీనర్సింహారెడ్డి, ఎ.అంజయ్యగౌడ్, మేఘనాథ్‌రెడ్డి, చిర్ర సాయిలు, మంద సాయిలు, కాకి రాములు, కుమార్, అమరేందర్‌రెడ్డి, పి.ఆనంద్, డి.జంగయ్య, దేశం కృష్ణారెడ్డి, జైపాల్, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.



బడంగ్‌పేట్: శ్రీధర్‌కు నియామకపత్రం అందజేస్తున్న సబితారెడ్డి

శక్తి వంచన లేకుండా పనిచేస్తా

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని 30వ డివిజన్‌కు చెందిన మురళీకృష్ణను పార్టీ కార్పొరేషన్ ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం మహేశ్వరం అసెంబ్లీ అభ్యర్థి సబితారెడ్డి నియామకపత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ.. పార్టీ పటిష్టతకు శక్తివంచన లేకుండ పనిచేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ భీమిడి స్వప్న, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

'తటస్థ' వ్యూహం



కార్మికులు, ఉద్యోగులను ఆకర్షించే యత్నం

- ఓట్లను రాబట్టేందుకు నేతల అవస్థలు

షాద్‌నగర్: ఎన్నికల సమయం దగ్గర పడుతోంది. అభ్యర్థులు ప్రచారాలను ముమ్మరం చేశారు. ఎత్తుకు పై ఎత్తులు వేస్తూ నేతలు వ్యూహాత్మకంగా ముందుకు కదులుతున్నారు. ఇప్పటికే ప్రచారాల్లో భాగంగా అభ్యర్థులు, నేతలు గ్రామాలకు వెళ్లి పలువురు పార్టీల్లో చేరేలా చొరవ తీసుకుంటున్నారు. అలాగే తటస్థ ఓటర్లను ఆకట్టుకోవడానికి అభ్యర్థులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఇప్పటికే నిర్వహించిన ప్రచారాల్లో పలు వర్గాల మద్దతును కూడ గట్టుకున్న నేతలు ఈసారి ఏ పార్టీల వైపు మొగ్గు చూపకుండా ఉండే ఓటర్ల మనసును గెలిచే వ్యూహాలకు పదును పెడుతున్నారు.

వీరి పైనే దృష్టి..

షాద్‌నగర్ అసెంబ్లీ స్థానానికి 14 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. ప్రధానంగా బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి అంజయ్య యాదవ్, కాంగ్రెస్ అభ్యర్థి వీర్లపల్లి శంకర్, బీజేపీ పార్టీ అందె బాబయ్య, ఆల్‌ఇండియా ఫార్వర్డు బ్లాక్ పార్టీ అభ్యర్థి పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి మధ్యే పోటీ నెలకొంది. అయితే ఈ ప్రాంతంలో చాలా మంది తటస్థ ఓటర్లు కీలకంగా మారనున్నారు. యువకులు, ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు, పలు రకాల వ్యాపారుల్లో పార్టీలకు అతీతంగా తటస్థంగా ఉన్న వారు చాలా మంది ఉన్నారు. మరికొందరు పరిశ్రమల్లో పని చేస్తూ ఇక్కడే స్థిర నివాసం ఏర్పాటు చేసుకొని ఓటు హక్కు పొందారు. ఇలాంటి వారిని ఆకట్టుకునేందుకు నేతలు అనేక ప్రయత్నాలు చేస్తున్నారు.

వ్యూహాత్మకంగా ముందుకు..

ఓట్లు రాబట్టేందుకు అభ్యర్థులు గల్లీ, గల్లీ తిరుగుతూ ఓ వైపు ప్రచారం కొనసాగిస్తూనే గ్రామాలు, పట్టణాల్లో సమావేశాలు నిర్వహిస్తున్నారు. దీనికి తోడుగా రాజకీయాలకు అతీతంగా ఉండే వారిని అంతర్గతంగా కలుస్తూ ఓట్ల కోసం పాట్లు పడుతున్నారు. ముఖ్యంగా గ్రామాల్లో ఆయా సామాజిక వర్గాల వారి ఓట్లను గంపగుత్తగా తమ వైపు మళ్లించేందుకు ద్వితీయ శ్రేణి నాయకులతో అభ్యర్థులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. నేరుగా కలవడమో లేదా ఫోన్లో మాట్లాడి మద్దతు తెలిపి, ఓటు వేయాలని అభ్యర్థిస్తున్నారు.

వలస జీవులే లక్ష్యంగా..

షాద్‌నగర్ ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందటంతో దేశంలోని బీహార్, ఉత్తర్‌ప్రదేశ్, రాజస్థాన్, ఒరిస్సా, హర్యానా, ఛత్తీస్‌ఘడ్, అస్సాం, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున కార్మికులు వలస వచ్చారు. ప్రముఖ ఫార్మా కంపెనీలు ఉండడంతో పని చేసే కార్మికులు ఏళ్ల తరబడి స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నారు. పెయింటింగ్, ఉడ్‌వర్క్, మార్బుల్, సీలింగ్, డిజైనింగ్ తదితర నైపుణ్య పనులు చేసే వారు కూడా ఇక్కడే ఓటు హక్కు కలిగి ఉన్నారు. వీరంతా పార్టీలకు అతీతంగా ఉండి జీవనం సాగిస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలతో పాటుగా, అసెంబ్లీ ఎన్నికల్లోనూ ప్రతిసారి వీరి ఓట్లే కీలకంగా మారుతున్నారు. ఓట్లను రాబట్టే విధంగా నేతలు కార్యాచరణ రూపొందిస్తున్నారు. పోలింగ్ తేదీ దగ్గర పడుతుండటంతో తటస్థ ఓటర్లపై వల విసురుతున్నారు.

'కారు' దిగిన కార్పొరేటర్


కార్పొరేటర్ రాంచందర్ దంపతులను కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న కేఎల్ఆర్

మీర్‌పేట: మీర్‌పేట కార్పొరేషన్ నుంచి బీఆర్ఎస్‌కు చెందిన మరో కార్పొరేటర్ కారు దిగి హస్తం గూటికి చేరారు. 43వ డివిజన్ కార్పొరేటర్ గజ్జెల రాంచందర్ శుక్రవారం బీఆర్ఎస్‌ను వీడి మహేశ్వరం కాంగ్రెస్ అభ్యర్థి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి సమక్షంలో రాంచందర్‌తో పాటు ఆయన సతీమణి ఎంపీటీసీ మాజీ సభ్యురాలు గజ్జెల పార్వతమ్మ కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా కేఎల్ఆర్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతించారు. అనంతరం వారు మాట్లాడుతూ బీఆర్ఎస్‌లో కష్టపడే వారికి సరైన గౌరవం దక్కడం లేదని.. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీ పథకాలకు ఆకర్శితులై స్వచ్ఛందంగా పార్టీలో చేరుతున్నామన్నారు.

ఓటే సామాన్యుడి వజ్రాయుధం



పెద్ద అంబర్‌పేటలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

పోలింగ్ శాతం పెంచేందుకు వినూత్న ప్రచారం

అబ్దుల్లాపూర్‌మెట్: 'ఒక్క ఓటు చరిత్ర గతిని మారుస్తుంది. అభ్యర్థుల గెలుపోటముల్లో ప్రతీ ఓటు కీలకమే. అది ఐదేళ్ల పాటు ప్రజల మంచిచెడులను నిర్ధారిస్తోంది. నా ఓటుతో ఏమవుతుందిలే అనే నిర్లక్ష్యం వద్దు.. ఓటే ప్రజాస్వామ్యానికి బలం.. ఓటు హక్కును వినియోగించుకోకుండా మంచి భవిష్యత్తును ఎలా ఊహిస్తాం.. కదలండి ఓటు వేసి బాధ్యత మీదే' అంటూ జిల్లా ఎన్నికల అధికారులు పోలింగ్ శాతాన్ని పెంచేందుకు గ్రామాల్లో అవగాహన కోసం ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఈ నెల 30న రాష్ట్ర వ్యాప్తంగా జరగనున్న సాధారణ ఎన్నికల్లో భాగంగా 18 ఏళ్లు నిండిన వారందరికీ ఓటు హక్కును వినియోగించుకునే విధంగా అవగాహన కల్పిస్తున్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో 2018లో జరిగిన ఎన్నికల్లో 65–70 శాతమే పోలింగ్ జరగడంతో ఈసారి ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు యంత్రాంగం కసరత్తులు చేస్తోందని ఎన్నికల అధికారి తెలిపారు. 'పట్నం' ప్రజలు ఓటు వేసేందుకు ఎంత మేరకు ముందుకు వస్తారో తెలియాలంటే ఓట్ల పండగ వరకు వేచి చూడాల్సిందే.

కాంగ్రెస్ సమన్వయ కమిటీ సభ్యుడిగా వెంకట్‌రెడ్డి


నియామకపత్రం అందజేస్తున్న వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్ గౌడ్

మొయినాబాద్: కాంగ్రెస్ చేవెళ్ల నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యుడిగా కొమ్మిడి వెంకట్‌రెడ్డి నియమితులయ్యారు. శుక్రవారం ఆయనకు కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్ నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తానన్నారు. పార్టీ శ్రేణులను సమన్వయం చేసి అభ్యర్థి గెలుపునకు కృషి చేస్తానన్నారు.

కౌన్ బనేగా కిస్మత్ వాలా!

గ్రేటర్ బరిలో తాజా, మాజీ మంత్రులు

- ఎన్నికల పోటీలో సబిత, తలసాని, మల్లారెడ్డి
- రంగంలో మాజీ మంత్రులు మర్రి, కృష్ణ యాదవ్
- సికింద్రాబాద్ నుంచి డిప్యూటీ స్పీకర్ పద్మారావు పోటీ



సాక్షి, సిటీబ్యూరో: శాసనసభలో అడుగు పెట్టాలని ఎన్నికలలో పోటీ చేసే ప్రతీ రాజకీయ నాయకుడి కల. గెలిచిన అభ్యర్థులకేమో ప్రభుత్వం ఏర్పాటయ్యాక మంత్రివర్గంలో చోటు దక్కించుకోవాలనే ఆశ. గెలుపు కోసం ఓటర్లను, చోటు కోసం పార్టీ పెద్దలను ప్రసన్నం చేసుకుంటుంటారు. ఈ నెల 30న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో పలువురు తాజా, మాజీ మంత్రులు జీహెచ్ఎంసీ నుంచి బరిలోకి దిగారు. వీరిలో తలసాని శ్రీనివాస్ యాదవ్ వరుసగా రెండుసార్లు కేసీఆర్ కేబినెట్‌లో చోటు దక్కించుకొని రికార్డు సృష్టించారు.

ఒకే శాఖకు రెండుసార్లు మంత్రిగా..

2014 ఎన్నికల్లో తలసాని శ్రీనివాస్ యాదవ్ టీడీపీ టికెట్‌తో సనత్‌నగర్ నుంచి పోటీ చేసి, టీఆర్ఎస్ అభ్యర్థి దండె విఠల్‌పై గెలుపొందారు. ఆ తర్వాత తలసాని కారెక్కి, కేసీఆర్ కేబినెట్‌లో చేరిపోయారు. పశుసంవర్ధక, మత్స్య, డెయిరీ అభివృద్ధి, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రిగా పనిచేశారు. 2018 ఎన్నికల్లో టీఆర్ఎస్ నుంచి బరిలోకి దిగిన తలసాని వరుసగా రెండోసారి గెలుపొంది, మళ్లీ మంత్రి వర్గంలో చోటు దక్కించుకున్నారు. రెండోసారి కూడా ఇదే శాఖకు మంత్రిగా పనిచేశారు. ప్రస్తుతం ఆయన మరోసారి సనత్‌నగర్ నుంచి పోటీ చేస్తున్నారు.

తొలి మహిళా హోంమంత్రిగా..

కాంగ్రెస్ అభ్యర్థిగా ఉమ్మడి రాష్ట్రంలో అప్పటికే వరుసగా మూడుసార్లు గెలిచిన సబితారెడ్డి.. తెలంగాణ ఏర్పడిన తర్వాత 2014లో జరిగిన తొలి శాసనసభ ఎన్నికల్లో పోటీ చేయలేదు. ఆ తర్వాత 2018లో మహేశ్వరం నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ నుంచి పోటీ చేసి, సిట్టింగ్ ఎమ్మెల్యే టీఆర్ఎస్ అభ్యర్థి తీగల కృష్ణారెడ్డిపై గెలుపొందారు. ఆ తర్వాత సబితా టీఆర్ఎస్ పార్టీలో చేరి, విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఉమ్మడి రాష్ట్రంలో 2009 నుంచి 2014 వరకు దేశంలోనే తొలి మహిళా హోం మంత్రిగా సబితా ఇంద్రారెడ్డి చరిత్ర సృష్టించారు. ఆమె మరోసారి మహేశ్వరం నుంచి పోటీ చేస్తున్నారు.

పార్టీలో చేరి.. కేబినెట్‌లోకి..

2014లో టీడీపీ పార్టీలో చేరిన చామకూర మల్లారెడ్డి మల్కాజిగిరి లోకసభ సభ్యుడిగా పోటీ చేసి గెలుపొందారు. తెలంగాణలో టీడీపీ నుంచి గెలుపొందిన ఏకైక పార్లమెంట్ సభ్యుడు మల్లారెడ్డే. 2016లో మల్లారెడ్డి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. 2018 శాసనసభ ఎన్నికలలో మేడ్చల్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ టికెట్‌తో పోటీ చేసి.. కాంగ్రెస్ అభ్యర్థి లక్ష్మారెడ్డిపై గెలుపొందారు. కేసీఆర్ కేబినెట్‌లో కార్మిక, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రిగా పనిచేశారు. మళ్లీ మేడ్చల్ నుంచి బరిలోకి దిగారు.

సికింద్రాబాద్ నుంచి డిప్యూటీ స్పీకర్..

1984, 2001లో హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో మున్సిపల్ కౌన్సిలర్‌గా పనిచేసిన పద్మారావు గౌడ్.. ఆ తర్వాత టీఆర్ఎస్ పార్టీలో చేరారు. 2004లో సికింద్రాబాద్ శాసనసభ నియోజకవర్గం నుంచి పోటీ చేసి గెలుపొందారు. 2009లో సనత్‌నగర్ నుంచి పోటీ చేసిన ఆయన.. కాంగ్రెస్ అభ్యర్థి మర్రి శశిధర్ రెడ్డి చేతిలో ఓడిపోయారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత 2014లో జరిగిన తొలి అసెంబ్లీ ఎన్నికలలో మళ్లీ సికింద్రాబాద్ నుంచి పోటీ చేసిన పద్మారావు గెలుపొందారు. తొలి కేబినెట్‌లో చోటు దక్కించుకున్నారు. ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్, క్రీడా శాఖ మంత్రిగా పనిచేశారు. 2018 డిసెంబర్‌లో తెలంగాణ శాసనసభ డిప్యూటీ స్పీకర్‌గా బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుత ఎన్నికలలో సికింద్రాబాద్ నుంచి అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.

బరిలో మాజీ 'ఉమ్మడి' మంత్రులు..

ఉమ్మడి రాష్ట్రంలో మంత్రులుగా పనిచేసిన కృష్ణ యాదవ్, మర్రి శశిధర్ రెడ్డిలు కూడా ఈసారి శాసనసభ ఎన్నికలలో తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. పశుసంవర్ధక శాఖ మంత్రిగా పనిచేసిన కృష్ణ యాదవ్.. జి.కిషన్ రెడ్డి స్థానంలో అంబర్‌పేట నియోజకవర్గం నుంచి బీజేపీ టికెట్‌తో బరిలోకి దిగారు. అలాగే పర్యాటక శాఖ మంత్రిగా పనిచేసిన మర్రి.. ఈసారి బీజేపీ కండువాతో సనత్‌నగర్ నుంచి పోటీ చేస్తున్నారు.

సంఘం శరణం గచ్ఛామి!



- మహిళా సంఘాల మద్దతు కోసం ప్రధాన పార్టీల ప్రయత్నాలు
- అతివల ఓట్లపై ప్రధాన పార్టీల వ్యూహ ప్రతివ్యూహాలు
- గ్రేటర్ జిల్లాల పరిధిలో 906 గ్రామ సంఘాలు
- 22,570 సహాయక సంఘాలు.. 2.42 లక్షల మంది సభ్యులు
- తాయిలాలు, హామీలతో ఆకట్టుకునేందుకు నేతల యత్నం

జిల్లా	గ్రామ సంఘాలు	స్వయం సహాయక సంఘాలు	సభ్యులు
రంగారెడ్డి	788	19,192	2,06,691
మేడ్చల్–మల్కాజిగిరి	118	3,378	36,282
మొత్తం	906	22,570	2,42,973

సాక్షి, మేడ్చల్ జిల్లా: మహిళా ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు అభ్యర్థులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. గెలుపే లక్ష్యంగా వ్యక్తిగతంగా వీరిని కలవడంతో పాటు సంఘాలతో ఆత్మీయ సమ్మేళనాలు ఏర్పాటు చేస్తూ వారి మద్దతు కోరుతున్నారు. ఈ క్రమంలో మహిళా సంఘాలను ప్రసన్నం చేసుకోవడంపై నేతలు మరింత కసరత్తు చేస్తున్నారు. మహిళా సంఘాల సానుకూలత ఉంటే.. వారి మద్దతు దొరకడంతోపాటు గ్రామాల్లో, కాలనీల్లో వారి ద్వారా చుట్టుపక్కల వారిని ప్రభావితం చేసే అవకాశం ఉండటంతో అభ్యర్థులు వీరి మద్దతుపై ప్రత్యేక దృష్టి పెడుతున్నారు.

సామాజిక వర్గాల వారీగా సంఘాలిలా..

నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో మొత్తం 906 గ్రామ సంఘాలు 22,570 స్వయం సహాయక సంఘాలు ఉండగా 2,42,973 మంది సభ్యులు ఉన్నారు. ఇందులో ఎస్సీ స్వయం సహాయ మహిళా సంఘాలు 5,168 ఉండగా, 50,212 మంది సభ్యులు ఉన్నారు. ఎస్టీ స్వయం సహాయక మహిళా సంఘాలు 2,180 ఉండగా, 25,379 మంది సభ్యులు ఉన్నారు. మైనార్టీ స్వయం సహాయ మహిళా సంఘాలు 656 ఉండగా,10,001 మంది సభ్యులు ఉన్నారు. బీసీ స్వయం సహాయక సంఘాలు 13,223 ఉండగా.. ఇందులో 1,31,346 మంది సభ్యులు ఉన్నారు. ఓసీ స్వయం సహాయక మహిళా సంఘాలు 1,342 మంది ఉన్నారు. ఇందులో 20,846 మంది సభ్యులు ఉన్నారు. ఇప్పటికే అధికార బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు వీరికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ.. మద్దతును కూడగట్టేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు.

హామీలు గుప్పిస్తూ..

- నగర శివారుల్లోని మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో మొత్తంగా 36 మండలాలు ఉండగా.. ఎక్కువ మంది సభ్యులు ఉన్న గ్రామాల్లోని బృందాలకు ప్రధాన పార్టీల నేతలు, అభ్యర్థులు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. స్వయం సహాయక మహిళా సంఘాల డిమాండ్లకు అనుగుణంగా హామీలు గుప్పిస్తున్నారు. తాము సూచించిన అభ్యర్థికి మద్దతుగా నిలబడటమే కాకుండా వారి బంధుమిత్రుల ఓట్లను కూడా పొందేలా పర్యవేక్షించాలని కోరుతున్నారు. కొందరు వ్యక్తిగత హామీలు కోరుతుండగా.. మరికొందరు గ్రామాల్లో తమకు ప్రత్యేకంగా భవనాలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తులు చేస్తున్నట్లు తెలుస్తోంది. దీనికి నాయకులు ముఖ్యంగా పార్టీల అభ్యర్థులు కూడా ఒప్పుకొంటూ వారి మద్దతు కూడగట్టుకుంటున్నారు.
- ఈ నేపథ్యంలోనే కొన్ని సంఘాల మహిళలు బహిరంగంగా ముందుకు వచ్చి మద్దతు ప్రకటిస్తుండగా.. ఇంకొన్ని సంఘాల వారు లోపాయికారీగా మద్దతు ఇస్తామని పేర్కొంటున్నారు. మహిళలు మెచ్చేలా బహుమతులు, గిఫ్టులు కూడా సంఘాలకు చేరేలా.. కొన్ని పార్టీల అభ్యర్థులు కసరత్తు చేస్తున్నారు. మద్దతు కూడగట్టడమే లక్ష్యంగా ఎత్తులకు పైఎత్తులతోపాటు వ్యూహ ప్రతివ్యూహాలతో ప్రధాన పార్టీలు ఆ సంఘాల సభ్యులను ఆకర్షించే ప్రయత్నంతోపాటు ఓట్లు రాబట్టేలా సర్వశక్తులూ ఒడ్డుతున్నట్లు సమాచారం. మహిళా సంఘాల వారీగా బ్యాంకు అకౌంట్లను తీసుకోవటం ద్వారా సహాయక సహకారాలు అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.
- నగర శివారు రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాల్లోని గ్రామ సంఘాలు, స్వయం సహాయక మహిళా గ్రూపులు.. వీటిలోని సభ్యుల వివరాలు ఇలా..